క్లుప్తంగా

రబీ పంటల నమోదు చేయించుకోవాలి



కంబదహాల్లో జొన్న పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రబీ సీజన్‌లో సాగు చేసుకున్న పంటల వివరాలను రైతులు వెంటనే ఈ పంట నమోదును చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని సి.బెళగల్, కంబదహాల్ గ్రామాలలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాల ఆర్బీకేలను సందర్శించారు. ఈ సందర్భంగా పంట నమోదు అంశాలను, ఆర్బీకే సేవలను, సంక్షేమ పథకాల అమలు, లబ్ధి చెందిన రైతుల వివరాలు తదితర రికార్డులను పరిశీలించారు. ఏఓ వెంట ఎంపీఈఓ వెంకటేష్, వ్యవసాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసీకి నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచి పోవడంతో కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు బుధవారం అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 1.94 టీఎంసీల నిల్వ ఉంది.

ఫుట్‌బాల్ పోటీలకు ఫార్మసీ విద్యార్థి



విద్యార్థితో ప్రిన్సిపాల్ మధుసూధన్‌శెట్టి

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మధుసూధన్‌శెట్టి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కుప్పంలో జేఎన్‌టీయూ సౌత్ జోన్ ఎంపిక పోటీలు జరగ్గా తమ కళాశాలకు చెందిన అతుల్ అత్యంత ప్రతిభ ప్రదర్శించారన్నారు. త్వరలో కేరళలో జరిగే సౌత్‌జోన్ క్రీడల్లో జేఎన్‌టీయూ తరుపున పాల్గొంటారన్నారు. అదేవిధంగా డైరెక్టర్ శివరాం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మునిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో బుధవారం దుకాణాలను సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ మెనేజర్ ప్రమోద్, డిప్యూటీ మెనేజర్ శివక్రిష్ణ ఆధ్వర్యలో నేషనల్ ట్యోబ్యాకో కంట్రోల్ ప్రొగ్రామ్ కింద పోలీసులు తనిఖీ చేశారు. దుకాణాల వద్ద సిగరెట్, బీడీ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిర్వాహకులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, హెడ్ కానిస్టేబుల్ సత్యం, జిల్లా ట్యోబ్యాకో కంట్రోల్ ప్రొగ్రామ్ కో–ఆర్డినేటర్ చిన్న వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

ఓర్వకల్లు: కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఈ నెల 15న నిర్వహించే అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామంలో జీవుజాత కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నాగన్నతో పాటు, సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్, ప్రజా సంఘాల నాయకులు మల్లేష్, మాసూం బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే సమావేశాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగన్నాధం, బుజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ల కోసమే మోదీ ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్‌ల కోసమే పని చేస్తుందని, నిజాయితీగా తపాలాశాఖ అభివృద్ధికి తోడ్పడుతున్న గ్రామీణ్ డాక్ సేవకుల గురించి ఏనాడూ ఆలోచించలేదని ఆలిండియా గ్రామీణ్ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఓల్డ్‌సిటీలోని హెడ్ పోస్టాఫీసు ఆవరణలో గ్రామీణ్ డాక్ సేవకుల దేశవ్యాప్త రెండోరోజు బుధవారం కొనసాగిన సమ్మెకు ఎఫ్ఎన్‌పీఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళి, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామీణ్ డాక్ సేవకులు రమేష్‌బాబు, పుల్లయ్య, రవి, ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ ఆర్డర్‌ను వ్యతిరేకించాలి

కర్నూలు(సెంట్రల్) : జేఎన్‌యూలో ప్రశ్నించే హక్కును హరిస్తున్న జీపీఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈవిధానం ద్వారా యూనివర్సిటీ క్యాంపస్‌లో 100 మీటర్ల పరిధి వరకు ఎవరూ కూడా పోస్టర్లను అతికించడం, నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, ధర్నాలు చేయడానికి వీలుండదన్నారు. అంతేకాక నిబంధనలను ఉల్లంఘిస్తే రూ.20 వేలు జరిమాన విధిస్తామని చెప్పడం అన్యాయమన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నన్నూరులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం
- రాగమయూరిలో రూ.1.50 కోట్లతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు–3వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. సర్పంచ్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎంపీపీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా హాజరయ్యారు. బైరెడ్డి కాలనీ, రాగమయూరీ గ్రీన్ హిల్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. బైరెడ్డి కాలనీలో మదర్సా నిర్మాణానికి స్థలం కేటాయించాలని ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను కోరారు. అందుకు అవసరమైన స్థలాన్ని తహసీల్దార్‌తో మాట్లాడి గ్రామ పెద్దల సమక్షంలో అక్కడికక్కడే అనుమతించారు. అనంతరం రాగమయూరీలో రూ.1.50 కోట్లతో మంచి నీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరి లబ్ధిని వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలను అధికారంలోకి తెచ్చుకోవడం మనందరం బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాటలు చెప్పి, మోసం చేసే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ ప్రజలకు పిలుపు నిచ్చారు. సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఫాతిమాబీ, కుసుమలత, సింగిల్ విండో చైర్మన్ దారం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని సీ.క్యాప్ సెక్షన్ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు–2 ఏడీఈ రాజేంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీడీ కార్మికుల కాలనీ, కళావతి నగర్, బీటీఆర్ నగర్, వాసవీ నగర్, అరుంధతి నగర్, ఎల్కూరు బంగ్లా, మారుతి నగర్, శ్రీవారి దర్శనం, సెయింట్ జోసెఫ్ కళాశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా కోతలు విధిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

17 నుంచి ధనుర్మాస పూజలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసం ప్రారంభం మొదటి ఆదివారం ధన్వంతరి హోమం, సూర్య హోమం, జనవరి 14వ తేదీ వరకు ఆరోగ్య ప్రదాత సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 18వ తేదీ సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, కావడి సేవలు, స్వామివారి కల్యాణోత్సవం జరుగుతాయని తెలిపారు.

పిల్లలకు సకాలంలో టీకాలను ఇవ్వాలి



టీకా వేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు సకాలంలో టీకాలను ఇవ్వాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం సచివాలయంలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా ఇస్తున్న టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన టీకాల అవశ్యకతను వివరించారు. ముఖ్యంగా బిడ్డకు, బిడ్డకు మధ్య మూడు సంవత్సరాలు అంతరం పాటించాలన్నారు. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదన్నారు. పిల్లలకు ఐఎఫ్ఎ, విటమిన్–ఎ సిరఫ్ పంపిణీ చేశారు. హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ రిపోర్టులను ఈ–ఆశా యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపురం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జ్యోతి, డీసీఎం ప్రసాద్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 27వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావలంటే, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం

కర్నూలు (టౌన్) : క్రీడల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని టీజీవీ యూత్ అధ్యక్షుడు టీజీ భరత్ అన్నారు. బుధవారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాలులో 6 వ జిల్లా స్థాయి ఉషూ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే తమ పిల్లలను మార్షల్ ఆర్ట్స్ శిక్షణకు పంపించడం మంచి పరిణామమన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ అండర్–12 అండర్–15 అండర్–17 అండర్–18 విభాగాల్లో జిల్లా స్థాయిలో ఉషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చిన్న శ్రీనివాసులు, చిరంజీవులు, సుధాకర్, అమితేశ్వర్ హాసన్, ఖాద్రి వ్యవహరించగా క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్.

కోడుమూరు రూరల్: ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుచ్చొందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందజేసేందుకు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవసరమైన వసతులు, మందులను అందుబాటులో ఉంచిందన్నారు. బుధవారం కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ఆస్పత్రి డెవలప్ మెంట్ సమావేశానికి ఎమ్మెల్యే డా.సుధాకర్ హాజరయ్యారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, నాడు–నేడు పథకం కింద రూ. కోట్లు ఖర్చుపెడుతున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండడం లేదని, కొన్ని రకాల వైద్య పరీక్షలు, మందులను బయటకు రాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఇప్పటికైనా అలాంటి పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. సమావేశంలో ఆస్పత్రి వైద్యాధికారి డా.నాగరాజు, వైద్యులు రంజీత్‌నాయక్, కేదార్‌నాథ్‌గౌడ్, పెద్దయ్య, అద్దాస్, పుష్పలత, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, నాయకులు అద్దుగల రాజశేఖర్ రెడ్డి, షాకీర్‌బాషా, కొలుట్ల, ఏకాంబరం, జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ఉన్నతమైన భవిష్యత్తు

- మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే సుధాకర్



కోడుమూరులో మోడల్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవడంతో ద్వారా ఉన్నతమైన భవిష్యత్ ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచించారు. బుధవారం కోడుమూరులోని మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పాఠశాల, హాస్టల్ పరిసరాలను పరిలించడంతో పాటు ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేమడంతో పాటు, జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని పెడుతోందని ఎమ్మెల్యే విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకుని డాక్టర్, ఇంజనీర్లు కావాలన్నారు. అనంతరం పాఠశాలలోని మౌలిక వసతులపై ప్రిన్సిపాల్ ఆశాజ్యోతితో ఎమ్మెల్యే చర్చించారు. 6నుంచి 8వతరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, లెక్కల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులతో మాట్లాడి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, షాకీర్‌బాషా, జయన్న, కొలుట్ల, ఏకాంబరం, మధు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప దీపోత్సవం

- అయ్యప్ప విళక్కులో మార్మోగిన శరణ ఘోష



స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు




అయ్యప్పస్వామి, కరుత్తు, కరుప్పు, వావర్ స్వామి, మాలికా పురోత్తమ్మ ఆలయాలు



అయ్యప్ప పడి పూజలో భక్తులు



అయ్యప్ప భజన చేస్తున్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి దీపోత్సవ వేడుక వైభవంగా జరిగింది. అయ్యప్ప దీప మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 46వ దీపోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహా గణపతి హోమం, లలితా సహస్ర నామ కుంకుమార్చన, పడి పూజ నిర్వహించారు. కేరళకు చెందిన సుమారు 40 మంది స్వాములు ఇక్కడికి వచ్చి అరటి బోదెలతో అయ్యప్ప స్వామి, కరుత్తు, కరుప్పు, వావర్ స్వామి, మాలికా పురోత్తమ్మ ఆలయాలు కట్టారు. చెండ, సింగారి మేళాలతో పూజా, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, దీపోత్సవ యాత్రలు అర్ధ రాత్రి వరకు నిర్వహించారు. గురువారం అయ్యప్పన్ విళక్కు, అయ్యప్ప జనన స్తోత్రాలతో జ్యోతులు వెలిగించుట, అయ్యప్ప వావర్ స్వాముల కాగడ హారతి, అయ్యప్ప స్వామి వావర్ స్వాముల యుద్ధం, అగ్ని ప్రవేశం కార్యక్రమాలు తెల్లవారు జాము వరకు జరిగాయి. చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి మిత్ర బృందంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. దీపోత్సవ కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, ప్రదీప్, సరోజమ్మ, విష్ణు రెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, రామచంద్రన్, జయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ

నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి పడి పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిజామాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప స్వామి దీక్షాదారులు కర్నూలుకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు శ్రీనివాసరావు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

16 న మండల మీట్

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఏర్పాటు చేసినట్లు కార్యాలయ పరిపాలానాధికారి విజయసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సునీతమ్మ అధ్యక్షతన నిర్వహించే మండల మీట్‌కు అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మన్మథ్ విజయ్ తెలిపారు. పేకాట ఆడతున్నారన్న సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో దాడులు నిర్వహించామని చెప్పారు. పేకాటాడుతున్న సంధ్యపోగు ఏసుదాసు, మల్లెపోగు కేశన్న, మల్లపోగు మ్యానియేల్, సంధ్యపోగు మద్దిలేటి, సంధ్యపోగు సామెల్, మల్లెపోగు అబ్రహాం, సందపోగు నర్సన్నను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ.1,410 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం బస్టాండ్‌లో అంగన్‌వాడీ, ఆయాల నిరవధిక సమ్మె రెండవ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు త మ సమస్యలు పరిష్కారించాలని కోరారు. ఉద్యోగ భ ద్రత కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. వీరికి ప్రజా సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు.

కుడా చైర్మన్‌ను కలిసిన బూడిదపాడు నాయకులు



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బూడిదపాడు నాయకులు

గూడూరు రూరల్: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని బూడిదపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న మాబాషా, దౌలత్‌బాషా, కొండారెడ్డి, ఈరన్న, సోమన్న, చోటేమియ్యా కలిశారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని అభివృద్ధి పరచాలని కోట్ల హర్షను వారు కోరారు. నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని కోట్ల తెలిపారు. అనంతరం కోట్లుకు పూల మాల వేసి సన్మానించారు.

రేపటి నుంచి సమావేశాలు

కర్నూలు(సెంట్రల్) : ఈనెల 15,16,17 తేదీల్లో కర్నూలులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు ఆహ్వాన సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రధాన కూడళ్లను అరుణ పతకాలతో నింపారు. సమావేశాల్లో భాగంగా 15వ తేదీన సుందరయ్య సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన. అక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు.

చారిత్రక నిర్మాణాలు జ్ఞాన సంపదలు

కర్నూలు(అర్బన్): చారిత్రక నిర్మాణాలు జ్ఞాన సంపదలని శ్రీ రామకృష్ణ హిమాలయ స్వామి అన్నారు. బుధవారం ఇక్కడకు వచ్చిన ఆయన స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జాతి అభివృద్ధికి, మానవ జాతి జ్ఞాన సంపదకు చరిత్ర అధ్యయనం మూలమన్నారు. 12వ శతాబ్దంలోనే కాటమరాజు గోసంరక్షణ, వాటి పునరుత్పత్తికి ఎంతో కృషి చేశారన్నారు. నగర సమీపంలోని గార్గేయపురంను ఆయన రాజధానిగా కొనసాగించారని శాసనాలు, తాళపత్ర గ్రంధాల్లో చెప్పబడిందన్నారు. గార్గేయపురంలో ఉన్న ఆలయం, దానికి సంబంధించిన భూములను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజలపై ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా, కాటమరాజు స్ఫూర్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో టి. శేషఫణి, అయ్యన్నయాదవ్, సింధు నాగేశ్వరరావుయాదవ్, వరుణ్‌కుమార్ యాదవ్, శ్రీనివాసులునాయుడు, వెంకట్రాముడు యాదవ్, అజయ్ యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వై.సుధాకర్‌బాబు బుధవారం తెలిపారు. కళాశాలలో ఇప్పటివరకు 7 బ్యాచ్‌లు శిక్షణను పూర్తి చేసుకున్నాయన్నారు. పదవ తరగతి నుండి ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసుకొన్న 30 సంవత్సరాల్లోపు అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్ ఫొటోతో ఈనెల 16వ తేదీలోగా స్థానిక కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరకాస్తు చేసుకున్న వారికి సోమవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రెండోరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్) : తమ డిమాండ్ల సాధన కోసం జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె రెండోరోజుకు చేరుకుంది. బుధవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో రెండో రోజు సమ్మెను ఏపీ శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల ప్రారంభించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నబీ రసూల్, ఐద్వా జిల్లా అధక్షురాలు కె.అరుణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, డీసీసీఅధ్యక్షుడు బాబురావు,జనసేననాయకుడు హర్షద్ సమ్మెకు మద్దతు ప్రకటించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎం.గోపాల్, చంద్రశేఖర్, రామాంజనేయులు, మునెప్ప పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com